క్లుప్తంగా

పరామర్శ

కాశినాయన : మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన కర్నాటి మోహన్‌రెడ్డి అనారోగ్యంతో వైద్యం చేయించుకుని గ్రామానికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, మండల కన్వీనర్ హనుమంతురెడ్డి తదితరులు మోహన్‌రెడ్డిని సోమవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేవీఎల్ వెంకటరెడ్డి, పంగా గురివిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

మైదుకూరు : రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ అన్నారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తదాన వారోత్సవాల్లో భాగంగా మైదుకూరులో సోమవారం సంతోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్డీఓ చంద్రమోహన్ స్వయంగా రక్తదానం చేశారు. మైదుకూరు తహసీల్దార్ రాజసింహ నరేంద్ర, సంతోష్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుబ్రహ్మణ్యం, జేబీవీఎస్ వ్యవస్థాపకుడు అశోక్, ఆశిక్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

30 శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలి

బద్వేలు అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం వెంటనే ఐఆర్ ప్రకటించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన ఆ సంఘం డివిజన్ స్థాయి కార్యవర్గ సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఏడాదిపాటు ఎదురు చూసినప్పటికీ ప్రభుత్వం అడుగు ముందుకు వేయలేదన్నారు. లేనిపక్షంలో ఉద్యమబాట తప్పదని అన్నారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రబాబు, డాక్టర్ హరి కొండయ్య, పి.శ్రీనివాసులు, బాలయ్య, పెంచలయ్య, ఓబులేసు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం ఆప్తాల్మిక్ ఆఫీసర్ కేజే రఘురామిరెడ్డి 133 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఐదుగురు విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరికి ఉచితంగా కంటి అద్దాలు అందచేస్తామని ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఈ సందర్భంగా తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 శాతం, పట్టణ ప్రాంతాల్లో 8–10 శాతం మేర స్కూల్ పిల్లల్లో దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుమన్, పాఠశాల హెడ్‌మాస్టర్ వేలాంగి రవికుమార్ పాల్గొన్నారు.

మంచితనానికి మారుపేరు గోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : మంచితనానికి మారుపేరుగా నిలిచిన మహోన్నత వ్యక్తి సానపురెడ్డిగోపాల్‌రెడ్డి అని మున్సిపల్ చైర్మన్ వాకమళ్లరాజగోపాల్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త సానపురెడ్డిరామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని బోవిళ్ళవారిపల్లె గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సానపురెడ్డిగోపాల్‌రెడ్డి తృతీయ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుడుగా ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడంతో పాటు నిరుపేద విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయ సహకారాలు అందించిన గొప్ప వ్యక్తి గోపాల్‌రెడ్డి అని కొనియాడారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామసుబ్బారెడ్డి, బ్రహ్మయ్య, గౌరవ సలహాదారు పుల్లంరాజు, అసోసియేట్ అధ్యక్షులు జి.పుల్లయ్య, కోశాధికారి గంగన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిచ్చయ్య, ఉపాధ్యక్షులు రాఘవరెడ్డి, ఆనందరావు, శ్రీరాములు, సుబ్బరాయుడు, శ్రీనివాసులరెడ్డి, లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

ఘనంగా నగర సంకీర్తన

ప్రొద్దుటూరు కల్చరల్ : ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నగర సంకీర్తన నిర్వహించారు. ఇస్కాన్ వ్యవస్థాపకుడు భక్తివేదాంతం స్వామి ప్రభుపాదులు, శ్రీకృష్ణబలరాముల విగ్రహాలను ఊరేగించారు. భారీ కొమ్ముల వృషభరాజములు రథాన్ని లాగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇస్కాన్ కేంద్రం నుంచి ప్రారంభమైన ఈ వేడుక రామేశ్వరం, వినాయక నగర్, గాంధీ రోడ్డు, కొర్రపాడు రోడ్డుల మీదుగా మందిరానికి చేరింది.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

దువ్వూరు : ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని మద్యం తాగి వాహనాలను నడిపేవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని దువ్వూరు ఎస్ఐ వినోద్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం తాగి వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు అనాథలుగా మిగులుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే మద్యం తాగి వాహనాలను నడుపుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు. ఇటీవల మద్యం తాగి వాహనాల్లో వెళుతున్న పట్టుబడిన వారికి మైదుకూరు కోర్టు నలుగురికి రూ.10వేలు జరిమానా విధించిందని చెప్పారు.

మోసం చేయడం
చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య




వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి క్యూఆర్ కోడ్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

గోపవరం : ఎన్నికల సమయంలో ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. బద్వేల్ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ అంశంపై సోమవారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ క్యూ ఆర్‌కోడ్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ, వాలంటీర్ వ్యవస్థ ద్వారా పార్టీలకతీతంగా ఇంటికే సంక్షేమ పథకాలు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు లభిస్తుందని భరోసా కల్పించారు. ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని, గతంలో సీఎంగా పనిచేసిన సమయంలో ఇచ్చిన హామీ ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. గోపవరంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సెంచరీ పానెల్స్ పరిశ్రమ ఏర్పాటు చేయడం ఒక మలుపురాయి అని, తద్వారా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు, కూలీలకు ఉపాధి దొరికిందన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, జగన్‌మోహన్‌రెడ్డి చుట్టూ ఉన్న ముఖ్య నేతలను అరెస్టు చేయడమే చంద్రబాబు, లోకేష్ లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ఎవరైతే చురుగ్గా పార్టీకి పనిచేస్తున్నారో.. వారిని టార్గెట్ చేస్తూ ఇళ్లను కూల్చడం, దాడులు చేయడం, తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేయడం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని, వారి అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జి.హరికృష్ణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, నాగేంద్ర, కె.సరిత, పుల్లయ్య, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, కె.రమణారెడ్డి, శివారెడ్డి, నరసింహారెడ్డి, మల్లేష్, రవీంద్ర, బి.సుబ్బారెడ్డి, శ్రీనాథ్, శ్రీరాములురెడ్డి, అబ్బిరెడ్డి, టి.వెంకటసుబ్బయ్య, గుమ్మడి తదితరులు పాల్గొన్నారు.

ఏడాదికే కూటమి పాలనపై వ్యతిరేకత

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదికే ఆ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోందని ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి అన్నారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని వెంకటేశ్వర ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బద్వేలు మండల విస్తృత స్థాయి సమావేశంలో రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో – చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యాచరణపై నాయకులకు, కార్యకర్తలకు సోమవారం దిశానిర్దేశం చేశారు. తొలుత దివంగత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన 143 హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. చంద్రబాబునాయుడు చేస్తున్న మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోకల మల్లేశ్వరరెడ్డి, చిన్నపోలిరెడ్డి, బోడపాటిరామసుబ్బారెడ్డి, పెద్దపోలిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కుప్పాలరమణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇన్‌చార్జిలు, ముఖ్యనేతలు పాల్గొన్నారు.

రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అక్రమం




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రెడ్యం

ఖాజీపేట : మద్యం కేసులో ఎలాంటి ఆధారాలు లేనప్పటికీ కేవలం కక్షపూరితంగా వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పక్ష నేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్ట్ చేయడం అక్రమమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఖాజీపేట మండలం దుంపలగట్టు గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాపై నమ్మకం ఉంచి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పదవి ఇచ్చినందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషికేవలం రాజకీయ కక్షతో, కూటమి నేతల ఒత్తిడితో సిట్ దగ్గర ఎలాంటి ఆధారాలు లేకపోయినా అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. ఒక ఎంపీగా నా పాత్ర ఎంపీ పార్లమెంట్ పరిధి వరకే అని చెప్పినా, నా తప్పులేదని వాదించినా అరెస్ట్ చేసి జైలుకు పంపడం కూటమి నేతల నీచ రాజకీయాలకు పరాకాష్ట అన్నారు. పక్కా ప్రణాళిక, కూటమి నాయకుల ఒత్తిడితోనే అరెస్ట్ చేశారని మండిపడ్డారు. పెద్దిరెడ్డి కుటుంబానికి ఉన్న ప్రజాభిమానాన్ని అక్రమ కేసులతో పోగట్టలేరనేది అరెస్టు కారకులు గుర్తుంచుకోవాలన్నారు.

ట్రూ అప్ ఛార్జీల వెనుక బాబు

బద్వేలు అర్బన్ : విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల వెనుక చంద్రబాబు– అదానీ క్విడ్ ప్రో కో అవినీతి ఉన్నట్లు స్పష్టమవుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ఆరోపించారు. స్థానిక ఎన్‌జీవో హోంలో సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు అదానీకి వరం – రాష్ట్ర ప్రజలకు శాపం అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇప్పటికే ట్రూ అప్, ఇంధన సర్దుబాటు వంటి అదనపు ఛార్జీలతో విద్యుత్ బిల్లు రెట్టింపయిందని, దానికి తోడు స్మార్ట్ మీటర్లు బిగిస్తే ప్రజలపై మరింత భారం పడుతుందని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని విస్మరించి విద్యుత్ ఛార్జీలు పెంచిందన్నారు. అలాగే 2024–25 సంవత్సరానికి గాను సెకీ విద్యుత్ ఒప్పందం ద్వారా అదానీ కంపెనీలతో 25 సంవత్సరాలకు యూనిట్ విద్యుత్ రూ.7కు పెంచుకుని విక్రయించేందుకు ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలపై రూ.1.50 లక్షల కోట్ల భారం మోపిందన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీను, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు చాంద్‌బాషా, చిన్ని, బాబు, మోక్షమ్మ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవికి వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్ మిల్ ఖాజాలకు సోమవారం కోవిడ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్ మాట్లాడుతూ కరోనా టైంలో 95 మంది కార్మికులను విధుల్లోకి తీసుకున్నారన్నారు. వారికి అప్పటి ధరలకు అనుగుణంగా రోజుకు రూ.400 ఇచ్చారని, ఇప్పుడు ధరలు పెరిగినందును అందుకు అనుగుణంగా రోజుకు రూ.570 పెంచి ఇవ్వాలని తెలిపారు. ఈ మేరకు కౌన్సిల్ సమావేశం అజెండాలో పెట్టి ఆమోదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోవిడ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు రాజు, కార్యదర్శి మేరిబాబు, దావీదు, ప్రసన్న, శివ, ఇస్సాకు, దానయ్య, వసంతరావు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలను యాప్‌లతో వేధించవద్దు



సీడీపీఓకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

బద్వేలు అర్బన్ : రోజుకో యాప్ రూపొందించి అంగన్వాడీ వర్కర్లను వేధించడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు అన్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సీడీపీఓ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లను మనస్తాపానికి గురిచేస్తున్న యాప్‌లను ఉపసంహరించుకోవాలని కోరారు. నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటుతుంటే అందుకు తగ్గట్లు మెను ఛార్జీలు పెంచకుండా, అంగన్వాడీ కార్యకర్తలను అప్పుల ఊబిలోకి నెట్టడం సరికాదన్నారు. ఏళ్ల తరబడి విధులు నిర్వర్తిస్తున్న అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అనంతరం సీడీపీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగేంద్రబాబు, కొండయ్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షురాలు సుభాషిణి, జయప్రద, లక్ష్మీనరసమ్మ, కె.వి.సుభాషిణి, సుజాత, అమ్మణ్ణి, ప్రవీణ, రామకుమారి, సీయోనుకుమారి, సుధ పాల్గొన్నారు.

ఏటూరు కాలువకు నీరు విడుదల



సాగునీటిని విడుదల చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చాపాడు : మండల పరిధిలో ప్రవహించే కేసీ కెనాల్‌కు అనుబంధమైన ఏటూరు కాలువకు సోమవారం సాయంత్రం సాగునీటిని విడుదల చేశారు. వారం రోజుల క్రితం రాజోలి ఆనకట్ట నుంచి కేసీ కెనాల్‌కు సాగునీటిని విడుదల చేయగా, మండలంలోని విశ్వనాథపురం సమీపంలో హైవే రోడ్డు నిర్మాణ పనుల వలన ఏటూరు కాలువకు సాగునీటిని విడుదల చేయడంలో జాప్యం ఏర్పడింది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం కేసీ కెనాల్ డీఈఈ పుల్లయ్య, ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ గురివిరెడ్డిలు ఏటూరు కాలువకు సాగునీటిని విడుదల చేశారు. ఈ నీటి వలన చాపాడు మండలంలోని విశ్వనాథపురం, లక్ష్మీపేట, చిన్నగురువళూరు, పెద్దగురువలూరు, ఖాజీపేట మండలంలోని మిడుతూరు, ఏటూరు ఇంకా పలు ప్రాంతాలలోని 9వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుందని గురివిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మేకల బాబు, మాజీ ఎంపీపీ వెంకటసుబ్బారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు చిన్నగోపాల్‌రెడ్డి, వీరశేఖర్‌రెడ్డి, ఓబుళరెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలకు తిప్పిరెడ్డిపల్లె దళితుల ఫిర్యాదు

చాపాడు : మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామంలోని దళితవాడలో ఈ నెల 19న కాలనీలోకి వెళ్లే సిమెంట్ రోడ్డును టీడీపీ నేత ఎస్.మల్లికార్జునరెడ్డి ధ్వంసం చేయడంపై దళితులు సోమవారం జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్‌లకు ఫిర్యాదు చేశారు. ఐదేళ్ల క్రితం ప్రభుత్వ నిధులు రూ.4.50లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును తమ స్థలంలో ఉందంటూ దౌర్జన్యంగా జేసీబీతో టీడీపీ నాయకుడు ధ్వంసం చేసి తొలగించాడని, దీనిపై అతనికి ఎలాంటి హక్కు లేదని, దళితుల పట్ల అగ్రవర్ణాల వారు చేసిన ఈ ఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అలానే తమకు దారి ఏర్పాటు చేయాలని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్లు తిప్పిరెడ్డిపల్లె దళితులు తెలిపారు.

తిప్పిరెడ్డిపల్లె దళితవాడ పరిశీలన

చాపాడు : మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లెలో ఈ నెల 19న టీడీపీ నేత మల్లికార్జునరెడ్డి ధ్వంసం చేసిన సిమెంట్ రోడ్డును సోమవారం వీఆర్వో ఇస్మాయిల్, విలేజ్ సర్వేయర్ విష్ణు, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరిలు పరిశీలించారు. సిమెంట్ రోడ్డు ధ్వంసం చేసిన సంఘటనపై స్థానిక దళితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. సిమెంట్ రోడ్డు నిర్మాణం, ప్రభుత్వ నిధులు, రోడ్డు నిర్మించిన స్థలం వంటి అంశాలపై దళితులతో పాటు స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై కింది స్థాయి అధికారులు మాత్రమే తిప్పిరెడ్డిపల్లెలో పర్యటించారే తప్ప మండల పరిషత్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు పర్యటించకపోవడం గమనార్హం.

అందుబాటులో ఎరువులు

గోపవరం : మండలంలోని బేతాయపల్లె రైతుసేవా కేంద్రంలో యూరియా అందుబాటులో ఉందని ఏఓ విజయరావు తెలిపారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు తీసుకెళ్ళి తెచ్చుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్ కుటుంబానికి విధేయుడు రమణారెడ్డి

పోరుమామిళ్ల : సిద్దవరం గ్రామానికి చెందిన పాలకొలను రమణారెడ్డి(50) గుండెపోటుతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలిసిన నాగార్జునరెడ్డి సాయంత్రం సిద్దవరం వెళ్లి పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్ కుటుంబానికి రమణారెడ్డి విధేయుడని తెలిపారు.

నేడు కృష్ణంపల్లెలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ

దువ్వూరు : మండలంలోని కృష్ణంపల్లె గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పాల్గొంటారని, మండలంలోని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చదవుల బాబుకు సేవా పురస్కారం

ప్రొద్దుటూరు : పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత డీకే చదువుల బాబు జీవన సాఫల్య జాతీయ సాహిత్య సేవా పురస్కారం అందుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం సెవెన్ స్టార్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ, శ్రీసత్యసాయి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో భారతీయ ముస్లిం లెజెండ్స్ పుస్తకావిష్కరణ జరిగింది.

ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలి

అట్లూరు : ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ దుష్యంత్ తెలిపారు. మండలంలోని కొండూరు గ్రామంలో ఏపీజీబీ ఆధ్వర్యంలో పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై, పీఎంజీబీవై, ఈ–కేవైసీ, డిజిటల్ ఫ్రాడ్స్‌పై సోమవరం అవగాహన కల్పించారు. మేనేజర్ దుష్యంత్ మాట్లాడుతూ బీమా ఉపయోగాలు, పెన్షన్, ఆన్‌లైన్ మోసాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో రాయుడు, సంతోష్, సిద్ధారెడ్డి, నాగలక్ష్మి, ప్రసాద్, బీసీ నారాయణ, వీఓఏ సుశీల, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

27న శ్రీ గణేష్ నగర ఉత్సవ కమిటీ సమావేశం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో 27వ తేదీ ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు శ్రీ గణేష్ నగర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సి.సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఉత్సవాల సమావేశం సబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

జీఓ 124ను వ్యతిరేకిస్తున్నాం



మున్సిపల్ కార్యాలయం వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రొద్దుటూరు : కార్మిక యూనియన్ల నాయకులతో చర్చించకుండా ప్రభుత్వం ఏకపక్షంగా జీఓ 124 ద్వారా కార్మికుల జీతాలను మూడు కేటగిరీలుగా ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలో భాగంగా మానవ హారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను అన్నింటిని ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 124పై రాష్ట్ర నాయకులతో మాట్లాడి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్, యూనియన్ పట్టణ అధ్యక్షుడు చంటి, కార్యదర్శి సాల్మన్, కోశాధికారి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 124 ద్వారా తాత్కాలిక ఉపశమనమే

ప్రొద్దుటూరు కల్చరల్ : మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన జీఓ 124 ద్వారా తాత్కాలిక ఉపశమనం కలిగించిందే తప్ప పూర్తి స్థాయిలో న్యాయం చేయలేదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ కార్మికులకు జీఓ 36 ప్రకారం గ్రేడ్ల వారీగా వేతనాలు రూ.21000, 24,500 చెల్లించాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు భిన్నంగా జీఓ 124 ద్వారా మూడు కేటగిరీలుగా విభజించి రూ.18,500, రూ.21,500, రూ.24,500 వేతనాలలో కోత విధించి రూ.3వేలు మాత్రమే పెంచారన్నారు. ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలను పెంచాలని సమ్మె చేస్తున్నారని, కార్మిక సంఘాల నాయకులతో చర్చించకుండా ఏకపక్షంగా ప్రభుత్వం ఈ జీఓను విడుదల చేసిందన్నారు. జీఓలో కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు గురించి ప్రస్తావన లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి చైతన్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి మధు, ఉపాధ్యక్షుడు రాజేష్, లక్ష్మీదేవి, అరుణ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

కలసపాడు యువకుడి ప్రతిభ

ప్రతిష్టాత్మక టకా అవార్డు స్వీకరణ



అవార్డును అందుకుంటున్న కామిశెట్టి జ్యోతి నరసింహ సాయి నితేష్

కలసపాడు : కలసపాడు యువకుడు సాయి నితేష్ సత్తా చాటాడు. సివిల్ ఇంజనీరింగ్ రంగంలో ప్రతిష్టాత్మక పాత్ర పోషించి పలు ప్రాజెక్టులలో పరిశోధనలు చేశారు. అమెరికా దేశంలోని ప్రతిష్టాత్మక టకా అవార్డు విజేతగా నిలిచి పలువురికి ఆదర్శంగా నిలిచారు. కలసపాడుకు చెందిన కామిశెట్టి చిన్న సత్యనారాయణ, రంగలక్షుమ్మల కుమారుడు కామిశెట్టి జ్యోతి నరసింహ సాయి నితేష్ చిన్న వయసులోనే పలు శాస్త్రీయ పరిశోధనలు పూర్తి చేశారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు పొంది, పలు అవార్డులు స్వీకరించారు. నితేష్ బీటెక్ హైదరాబాద్‌లోని గోకరాజు రంగరాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అనంతరం వరంగల్ నిట్‌లో పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసి రీసైకిల్ అగ్రిగేట్స్ స్టీల్ ఫైబర్స్‌పై పరిశోధనలు చేసి డాక్టరేట్ స్వీకరించారు. అనంతరం అమెరికాలోని టెక్సాస్ యూనివర్సిటీలో చేసిన పలు పరిశోధనలకు గాను టెక్సాస్ అగ్రిగేట్ అండ్ కాంక్రీట్ అసోసియేషన్ టకా సంస్థ నుండి కాంక్రీట్ ఇన్నోవేషన్ అవార్డు అందుకున్నారు. నితేష్‌ను పలువురు ప్రశంసిస్తున్నారు.

నిబంధనలు పాటించకుంటే
ఆస్పత్రులపై కఠినచర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్

మైదుకూరు : ఆస్పత్రి బోర్డులో ఉన్న వైద్యులు తప్పనిసరిగా ఆస్పత్రిలో ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వి.మల్లేష్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం బద్వేలు డివిజన్ పరిధిలోని ఆస్పత్రుల్లో జరిగిన అబార్షన్లపై ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ మల్లేష్ విలేకరులతో మాట్లాడుతూ ఆస్పత్రి బోర్డులో కనబరిచిన డాక్టర్లకు బదులుగా అర్హత లేని డాక్టర్లు వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొద్ది రోజుల కిందట పోరుమామిళ్లలో ఎంబీబీఎస్ డాక్టర్ పేరు బోర్డులో పెట్టి అర్హత లేని వ్యక్తి వైద్యం చేస్తుండగా తనిఖీ చేసి ఆస్పత్రిని సీజ్ చేసినట్టు వివరించారు. అదే విధంగా ఆస్పత్రిల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, అటువంటి పరీక్షలు నిర్వహించినట్టు సమాచారం ఉంటే ఆ ఆస్పత్రులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. 20 వారాలు దాటిన గర్భిణులకు అబార్షన్లు చేయడం కూడా చేయకూడదని తెలియజేశారు. అదే విధంగా క్లినికల్ ల్యాబ్‌లు నిర్వహించేవారికి అనుమతులు తప్పనిసరి అని పేర్కొన్నారు. బద్వేలు డివిజన్‌లోని ఆస్పత్రులలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో జరిగిన అబార్షన్లపై ఆడిట్ నిర్వహించారు. కార్యక్రమంలో గైనకాలజిస్టులు కె.శ్రీలలిత, వి.శ్రీలత, హెల్త్ సూపర్‌వైజర్లు కె.వీరాంజనేయులు, డి.వెంకటేశ్వర్లు, ఎంపీహెచ్ఈఓలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అబార్షన్‌తో అమ్మ ఆరోగ్యానికి ముప్పు



ఆడిట్ నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

ప్రొద్దుటూరు క్రైం : అబార్షన్ చేయించుకోవడం తల్లి ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీత తెలిపారు. జిల్లా ఆస్పత్రిలోని పీపీ యూనిట్‌లో సోమవారం జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగిన అబ్షాన్‌లను ఆడిట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అవసరం లేకున్నా అబార్షన్‌లు చేయించుకుంటున్నారన్నారు. మొదటి, రెండవ కాన్పుల్లో ఆడపిల్లలు పుట్టిన వారు అబార్షన్‌లు చేయించుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఆడిట్ నిర్వహించి ఎక్కడ అబార్షన్‌లు చేయించుకుంటున్నారో విచారించి సంబంధిత ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. తల్లి ఒక సారి అబార్షన్ చేయించుకుంటే మళ్లీ గర్భం దాల్చే అవకాశాలు తగ్గుతాయని చెప్పారు. అలాగే తల్లిదండ్రులు కూడా ఆడబిడ్డ అయినా, మగ బిడ్డ అయినా సమానమని గుర్తించి వారి ఎదుగుదలకు పాటు పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, గైనకాలజిస్టు డాక్టర్ సాగరకుమారి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.